నేడు జాబ్ మేళా..

హిమాయత్‌నగర్, మార్చి 12: బ్రైట్‌లైట్ సొసైటీ, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నేడు జాబ్ మేళా నిర్వహించనున్నారు. బాలానగర్ బీబీఆర్ దవాఖాన సమీపంలోని యువకేంద్రంలో మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్ట్ సమన్వయకర్త వి.శివశంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ కేర్ సర్వీస్, సోలార్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, రిటైల్ వంటి ఉద్యోగాల కోసం పలు కంపెనీల ప్రతినిధులు విచ్చేసి అభ్యర్థుల అర్హతలను బట్టి ఎంపిక చేస్తారని తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మేళాకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 86882 65800లో సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్.. నగదు తస్కరణ

బంజారాహిల్స్: ఇంటి తలుపు పెట్టకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మొబైల్ ఫోన్‌తో పాటు నగదు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నం.2 ఇందిరానగర్‌లో లింగంపల్లి రవి ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి తలుపు వేసుకోలేదు. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి రవి ఫోన్‌తో పాటు ఆల్మారాలోని రూ.22వేల నగదుతో ఉడాయించాడు. ఉదయాన్నే చూడగా ఫోన్‌తోపాటు నగదు కనిపించలేదు. బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్

వెంగళరావునగర్: స్నేహితురాలి ఇంటికెళ్లేందుకు ఆటో కోసం నిరీక్షిస్తున్న యువతి నుంచి గుర్తితెలియని ఆగంతకులు సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఈ ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. కార్మికనగర్‌కు చెందిన ఎస్.నందీశ్వరి సోమవారం మధ్యాహ్నం తన స్నేహితురాలి ఇంటికెళ్లేందుకు కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద వేచిఉంది. బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు చేతిలోని ఫోన్‌ను లాక్కెళ్లారు. దీంతో బాధితురాలు మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి కాటేదాన్ శివాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో రోడ్డుపక్కన పడుకోగా గుర్తుతెలియని వాహనం అతడిపై వెళ్లింది. రెండు కాళ్లు విరిగి అధిక రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి రాష్ డ్రైవింగ్ ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్, మార్చి 12: మద్యం మత్తులో బైక్ నడిపిస్తూ డివైడర్‌ను డీకొట్టి ప్రమాదానికి గురైన ఇద్దరు యువకులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగోల్‌లోని బండ్లగూడకు చెందిన బి.మోహన్‌సింగ్(23), మణిదత్త గణేశ్ (23) బంజారాహిల్స్‌లోని తన స్నేహితుడి పుట్టినరోజు కోసం సోమవారం రాత్రి వచ్చారు. అర్ధరాత్రి వరకూ మద్యం తాగి రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై జూబ్లీహిల్స్ రోడ్ నం.92లోని ఫెడరల్ బ్యాంక్ మీదుగా అతివేగంతో వెళ్తున్నారు. అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఈ ఘటనలో మోహన్‌సింగ్ తలకు తీవ్రంగా, గణేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రాష్ డ్రైవింగ్ చేసినందుకు యువకులపై ఐపీసీ 279, 337 సెక్షన్లతో పాటు ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కమిషనర్‌కు సమస్యలు ఎక్కుపెట్టిన స్థానికులు

బండ్లగూడ, మార్చి 12: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్నుపై అవగాహన కల్పించేందుకు వెళ్లిన కమిషనర్ శరత్‌చంద్రను తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు నిలదీశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ శరత్‌చంద్ర శివసాయిన గర్‌కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు సమస్యలను లేవనెత్తారు. పరిష్కరించాలని ఆయనకు వివరించారు. ఇందుకు స్పందించిన శరత్‌చంద్ర త్వరలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఆస్తి పన్ను చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు.

కమిషనర్ శరత్‌చంద్రను సమస్యలపై నిలదీస్తున్న ప్రజలు

ఓపెన్ డ్రైనేజీతో.. అవస్థలు

దర్గా ఖలీజ్‌ఖాన్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు

- సర్వీసు రోడ్డులో ప్రయాణించాలంటేనే జంకు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- సమస్య మా దృష్టికి రాలేదు: యాదయ్య, డీఈఈ

సర్వీస్ రోడ్డు వెంట ప్రవహిస్తున్న మురుగు

బండ్లగూడ, మార్చి 12: ఓపెన్ డ్రైనేజీతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ఆయా రోడ్ల వెంట ప్రయాణించాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి దాపురించింది. డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గా ఖలీజ్‌ఖాన్ వద్ద ఉన్న సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీ పైపులలైన్ల నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పక్కనే నిల్వకుండిపోయింది. అంతేగాకుండా చెత్తాచెదారం పేరుకుపోయింది. ఓపెన్ డ్రైనేజీలతో దర్గా ఖలీజ్‌ఖాన్ గ్రామ ప్రజలు నిత్యం దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు.

దర్గా ఖలీజ్ ఖాన్ వద్ద ప్రవహిస్తున్న మురుగు

అంతేకాకుండా సర్వీస్ రోడ్డు వెంట రాకపోకలు కొనసాగించే వాహనదారులు సైతం ముక్కున ముసుకుని ప్రయాణించాల్సి వస్తుందని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిల్వ ఉండటం ద్వారా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందిచి తగిన చర్యలు తీసుకుని డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్య మా దృష్టికి రాలేదు: యాదయ్య, డీఈఈ

దర్గా ఖలీజ్‌ఖాన్ గ్రామంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్య మా దృష్టికి రాలేదు. గ్రామంలో పర్యటించి, సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం అని ఆయన తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు: ఇనాయత్, దర్గా ఖలీజ్‌ఖాన్ వాసి

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో వారి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. దర్గా ఖలీజ్‌ఖాన్‌లోని డ్రైనేజీ సమస్య గురించి గతంలో అధికారులకు ఫిర్యాదులు చేశాము. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిరోజు మురుగువాసనతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

విద్యతోనే మహిళా జీవితాల్లో వెలుగులు: డీసీపీ పద్మజ

బంజారాహిల్స్, మార్చి 12: ఉన్నత విద్యతోనే మహిళా జీవితాల్లో వెలుగులు నిండుతాయని మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి డీసీపీ పద్మజ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళలను సత్కరించారు. డీసీపీతో పాటు గైనకాలజిస్ట్ కొత్త శ్రీవాణి, డెర్మటాలజిస్ట్ నవ్యచౌదరి తదితరులు సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేకాలనీ క్లబ్ అధ్యక్షుడు వైవై రెడ్డి, ఉపాధ్యక్షురాలు జయప్రదారెడ్డి, కార్యదర్శి రాంచంద్రారెడ్డి, ఈసీ మెంబర్ లక్ష్మీరెడ్డి, ప్రేమ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ పద్మజారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్ సభ్యులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి: ఏఐటీయూసీ

హిమాయత్‌నగర్, మార్చి 12: కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ నగర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం, హక్కులను కాపాడకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీలు పార్లమెంట్‌లో కార్మికుల సమస్యలపై మాట్లాడకపోవడం విడ్డురంగా ఉందన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి పోరాటాల తో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కమ తం యాదగిరి, కార్య నిర్వాహక అధ్యక్షుడు పి.వెంకటయ్య, నేతలు కె.రమేశ్, నరసింహ, కొమురెల్లి బాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

ఆయుర్వేద వైద్యానికి కంభంపాటి విశేషకృషి

డాక్టర్ సతీశ్‌రెడ్డి, డాక్టర్ వంశీ రామరాజుకు అవార్డులు అందజేస్తున్న డాక్టర్ అనసూయ, రామలక్ష్మి తదితరులు

ఖైరతాబాద్, మార్చి 12: ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు దివంగత డాక్టర్ కంభంపాటి స్వయంప్రకాశ్ జయంతి మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్‌కేఆర్ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ హాజరై మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్య విస్తృతికి కంభంపాటి స్వయంప్రకాశ్ విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రముఖ ఆర్థోపెడిక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సతీశ్‌రెడ్డి, డాక్టర్ వంశీ రామరాజుకు స్వయంప్రకాశ్ స్మారక అవార్డుతో పాటు ఆయుర్వేద విద్యలో రసశాస్త్రం పూర్తి చేసిన హాసిని, అక్షితలకు డాక్టర్ అనసూయ, ట్రస్ట్ చైర్‌పర్సన్ కె.రామలక్ష్మి చేతుల మీదుగా మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్లు కె.శ్రీనివాస్, సంహిత, లలిత, రఘు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి'

మణికొండ, మార్చి 12: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రతికార్యకర్త సైనికుల్లా కష్టపడి పని చేయాలని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ నేత పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగ్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల డీసీసీ అధ్యక్షులు రాంమోహన్‌రెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, నాయకులు సిద్ధేశ్వర్, ఆశోక్‌యాదవ్, శేఖర్ యాదవ్, సంజయ్, మహిళా అధ్యక్షురాలు, కృష్ణారెడ్డి, చెక్కల ఎల్లయ్య, మహేందర్‌గౌడ్, ఇస్మాయిల్, ధనుంజయ్, ప్రవీన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జలపల్లి నరేందర్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే.. దేశానికి ప్రగతి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జయలత, గెడ్డం ఝాన్సీ, ప్రొఫెసర్ పుష్పచక్రపాణి తదితరులు

ఖైరతాబాద్, మార్చి 12: ఉత్పత్తి, వ్యాపార రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డాక్టర్ జయలత అన్నారు. ఒక కుటుంబం ఉన్నతంగా ఎదగాలంటే తల్లి ప్రధాన పాత్రపోషిస్తుందని పేర్కొన్నారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో డీఎస్ఎస్ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు హాజరై మాట్లాడారు. జయలత, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ పుష్పచక్రపాణి, ఉషసీతాలక్ష్మి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యంపై మహిళలు దృష్టిసారించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోక్సో యాక్ట్ తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, డీఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తిపన్ను చెక్కును ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్‌తో కలిసి స్వీకరిస్తున్న డీసీ సేవా ఇస్లావత్

జూబ్లీహిల్స్, మార్చి 12: వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకుని పాతబకాయిలు చెల్లించాలని యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడలోని సర్కిల్ కార్యాలయంలో పన్ను బకాయి చెక్కులను స్వీకరించారు. డీడీ మాట్లాడుతూ.. పాతబకాయి ఒకేసారి చెల్లించేవారికి 2022-23 వరకున్న ఎరియర్స్‌పై 90 శాతం వడ్డీ మాఫీ ఉంటుందన్నారు. ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని, చట్ట ప్రకారం ఆయా ఇంటి యజమానుల ఆస్తులు, దుకాణాల ఆస్తులను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

నందినగర్‌లో పర్యటిస్తున్న వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, మార్చి 12: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని నందినగర్‌లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు రూ.9.6లక్షల వ్యయంతో చేపట్టిన పైపులైన్ పనులను మంగళవారం వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీలో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. బస్తీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, లో ప్రెషతో నీళ్లు వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ కవితారెడ్డి హామీ ఇచ్చారు.

రచ్చకెక్కిన కాంగ్రెస్.. బాహా బాహీ

మణికొండ, మార్చి 12: కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు రచ్చ కెక్కాయి. నార్సింగిలో కాంగ్రెస్ నేతల ముఖ్యసమావేశం జరిగిన కొద్ది సేపటికే కొట్టుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఎమ్మెల్యే బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తనయుడు అభిలాశ్, పార్టీ సీనియర్ నేత అంజనేయులు ఇరువర్గాలు గొడవకు దిగాయి. ఒక వైపు సమావేశం జరుగుతుండగానే ఇరువర్గాల అనుచరులు ఒకరిపై ఒకరు వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. అనంతరం ఆరె మైసమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఐకమత్యంగా ఉండాల్సిన కాంగ్రెస్ నేతలు గొడవ ఏమిటని విస్మయానికి గురైయ్యారు. ఇదేతీరు కొనసాగితే పార్టీకి తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీలో చర్చనీయాంశమైంది.



కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణగూడలోని క్యాంప్ కార్యాలయం వద్ద చెక్కులను అందజేస్తున్న మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, మార్చి 12: పేదింటి ఆడబిడ్డల పెండ్లిలు భారం కావొద్దని మాజీ సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి అన్నారు. మంగళవారం నారాయణగూడలోని క్యాంప్ కార్యాలయం ఆవరణలో 8మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మండల వీఆర్‌వో విష్ణు, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్, జక్కి, జైస్వాల్, మన్సూర్, అనీశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేసుకొని.. కారులో పరార్

వెంగళరావునగర్, మార్చి 12: కారు పెట్రోల్ ట్యాంక్ ఫుల్ చేయించుకుని డబ్బు చెల్లించకుండా పరారైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అమీర్‌పేట్ సారథి స్టూడియో ఎదుట ఉన్న భారత్ పెట్రోల్ పంప్‌లో సోమవారం అర్ధరాత్రి వోల్వో బ్లాక్ కలర్ కారు పెట్రోల్ కోసం వచ్చింది. ట్యాంక్‌లో పెట్రోల్ ఫుల్ చేయించుకున్నాడు. బిల్లు రూ.6,700 అయిందని చెప్పి డబ్బు అడిగితే కార్డ్ స్వైప్ చేస్తానని కస్టమర్ చెప్పడంతో స్వైప్ మిషన్ ఇచ్చాడు. స్వైప్ చేస్తున్నట్లు నటించి కారుతో అక్కడి నుంచి ఉడాయించాడు. పెట్రోల్ పంప్ సూపర్‌వైజర్ సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి'

పద్మశాలీపురంలో కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసిన సంస్థ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12: పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతారని రామకృష్ణా సేవాసమితి సభ్యులు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీపురంలో రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతను క్రమతప్పకుండా చిత్తశుద్ధితో నిర్వహించే 45 మంది పారిశుధ్య కార్మికులకు సేవాసమితి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో మసున వెంకటేశ్, గంజి వెంకటేశ్, బొల్ల శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, శివ, శశి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ప్రతినిధులు

మణికొండ, మార్చి 12: విద్యార్థులు ఇష్టంగా చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలరని శ్రీజా హోం ఫుడ్స్ అధినేత వాసిరెడి శివాజి అన్నారు. మణికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదనపు తరగతుల సందర్భంగా అల్పాహారం అందజేశారు. వాసిరెడ్డి శివాజి కూతురు శ్రీజ పుట్టిన రోజు సందర్భంగా గోల్డెన్ ఓరియల్ అపార్ట్‌మెంట్ వరిష్టనసానగరికుల సంఘం సభ్యులు కార్యక్రమాన్ని చేపట్టారు. వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనిజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు, ట్రస్ట్ కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు రాజశేఖర్, రవీంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే.. నైపుణ్యాభివృద్ధి

వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, ప్రతినిధులు, అధ్యాపకులు

మణికొండ, మార్చి 12: విద్యార్థులు ప్రయోగాత్మక విశ్లేషణతో కూడిన సాధనతోనే తమ నైపుణ్యాభివృద్ధి సాధ్యమని మహాత్మ గాంధీ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం-ఎంజీఐటీ, ఈఎంఎన్ఎల్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ) డిజైన్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి హాజరై ట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో ఉత్తమ శిక్షణ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్పీ సింగ్, ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎ.బాలరాజు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ శ్రీరాం, జయంత్, నితీశ్, పవన్, అభిషేక్, దీపిక, అనూప్, సాత్విక్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my client Mr. Ghouse Samdhani s/o Abdul Khader Jeelani has entered into an agreement to purchase the Plot bearing No. A4 in Sy.No.53/A, 53/AA, 22 and 23, admeasuring 203 Square yards equivalent to 169.70 Square meters situated at Sanjeevani Hills (11th Venture), Hyderguda Village, Rajendra Nagar Mandal, R.R. District with Malli Sudhakar S/o. Malli Jayapaul.

The general public is hereby warned against entering into an agreement of sale/conveyance or entering into a sale deed/conveyance deed for the above said property; and any person dealing in respect of the aforesaid property, would be doing so entirely at his own risk as to the costs and consequences arising thereof. Description of the property: Plot bearing No. A4 in Sy.No.53/A, 53/AA, 22 and 23, admeasuring 203 Square yards bounded by:North 40 Feet Road, South: Open Space, East: 40 Feet Road, West: Open Space.

Sd/- MOHD. HABEEBUDDIN, MBA, LL.B
ADVOCATE
5-14-5, Laxmi Nagar, H.B. Colony, Maula Ali, Hyderabad-500040. T.S.
CELL: 9885786483